విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

RNI NO,TELTEL/2023/88524
మెదక్ టుడే
తెలుగు దినపత్రిక MEDAK TODAY

Call us now!
9494117870



RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

శుక్రవారం, మే 09 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 209





- భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే
- దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం
- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీలో సిఎం రేవంత్

# ఉగ్రవాదాన్ని ఎగదోస్తే..


# మీకు నూకలు చెల్లినట్లే

**హైదరాబాద్,మే 8 :** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహిం చేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు- పలువురు మంత్రులు, ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు- ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లిన ట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబు తామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

వివరాలు 2లో

# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

- లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం
- పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు
- భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు
- సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు
- ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు
- భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్



**న్యూఢిల్లీ,మే8:** భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు- భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ,

వివరాలు 2లో

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

- వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు
- ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న నలుగురు మంత్రులు



**ఖమ్మం,మే8:** ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని

వివరాలు 2లో



# ఆపరేషన్ సిందూర్ అద్భుతం

## - ఆర్మీకి మంత్రి ఉత్తమ్ అభినందనలు

**సూర్యాపేట,మే8:** జమ్మూకశ్మీర్‌లో ఇటీవల భారత పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు దాడులకు భారీత్ ప్రతీకారం తీర్చుకోవడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్థించారు. మాజీ సైనికుడిగా భారత్ సైన్యానికి మంత్రి ఉత్తమ్ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత బలగాలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడులు విజయవంతంగా పూర్తి

వివరాలు 2లో


# నగరంలో హైఅలర్ట్...



**హైదరాబాద్,మే8:** ఈ నెల 10వ తేదీ నుంచి హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రారంభ వేడుకలు నిర్వహించనున్న గచ్చిబౌలి స్టేడియంను ఆధీనం చేసుకున్న పోలీసులు అనువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకో వడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. పోటీలో పాల్గొనే అందగత్తెలు రాష్ట్రం లోని పలు ప్రాంతాలను సందర్శించనుం డడంతో ఆయా ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరు పర్యటించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిజిపి జితేందర్ ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు ఇప్పటికే పలుమార్లు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిం చారు. పోటీల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి చర్చించి, ఆదేశాలు జారీ చేశారు. పోటీలో పాల్గొనేందుకు 120 దేశాలకు చెందిన అందెగత్తెలు ఇప్పటికే నగరానికి వచ్చారు. వారికి స్టార్ హెూటళ్లలో బస ఏర్పాటు చేశారు, హెూటళ్ల వద్ద, వారు ప్రయాణించే మార్గాల్లో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటన జరిగినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పోలీసులు భారీగా భద్రతను ఏర్పాటు చేశారు. సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ గజారావు భూపాల్ పోటీలకు భారీ భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలకు

వివరాలు 2లో

# ప్రధాని మోడీ .. ఓ అనికేత్: పవన్ ట్వీట్




**అమరావతి, మే 08:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ సంచలన ట్వీట్ చేశారు. ప్రధాని మోదీని అనికేత్ అని అభివర్ణిం చారు. అనికేత్ ఒక పేరు, ఒక సంకల్పమని తెలిపారు. తన సన్యాసి జీవితంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అనికేత్ అని పిలిచేవారని పవన్ అన్నారు. అనికేత్ అంటే ఇళ్లు లేకుండా అని అర్థం అని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రధాని గురించి పవన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'అనికేత్' - ఒక పేరు, ఒక సంకల్పం. తన సన్యాసి జీవితంలో, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీనియస్ అని సంబోధించారు.

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన

## - ఆవిష్కరణలు పెట్టుబడులతో భవిష్యత్‌కు బాటలు

## - కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెల్లడి



**తిరుపతి, మే 08:** ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకు ంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకు స్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా మార్చే ందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు- దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5 వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా

వివరాలు 2లో

# జిహాద్ పేరుతో హత్యలు చేస్తారా..?

- ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తారా
- పాక్ ఘాతుకాలపై మండిపడ్డ ఓవైసీ



**న్యూఢిల్లీ,మే8:** భారతదేశంపై జిహాద్ పేరిట హత్యలు చేయాలని పాకిస్తాన్ మద్దతుతో ఉన్న ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మరోసారి ఉగ్రవాదంపై ఘాటు వ్యాఖ్యలు చేసారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యత వహించిన లష్కరే తోయిబాకి అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ పై అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహిం చాలని అన్నారు. ఇకపోతే, భారత వైమానిక దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై ఎయిర్÷-టస్ట్రైక్స్ నిర్వహించిన మరుసటి రోజు గురువారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన

వివరాలు 2లో

RNI NO : TELTEL/2023/88524
మెదక్ టుడే
MEDAK TODAY తెలుగు దిన పత్రిక...
శుక్రవారం, మే 09 2025

## ఆపరేషన్ సిందూర్ అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని అన్నారు. భారత సైన్యం సమర్థవంతంగా శత్రువుల మీద దాడి చేసి భారత సైన్య లక్ష్యాలను పూర్తి చేసి పాకిస్తాన్‌కి సరైన గుణపాఠం చెప్పిందని అన్నారు. గురువారంకోదాడ పట్టణంలో వెంకటేశ్వర మల్టీస్పెషా లిటీ- హాస్పిటల్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పట్టణంలో మెరుగైన వైద్యం సేవలు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవడంతో ర్యాలీ నిర్వహించాలని భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు.

## నగరంలో హైఅలర్ట్..

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈవెంట్ కొనసాగుతుందని అన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఇప్పటికే 80శాతానికి పైగా అతిథులు, పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారికి కేటాయించిన హొటళ్ల వద్ద కూడా భారీగా భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అతిథులు స్టే చేసే పరిసరాలను రెడ్ జోన్, గ్రీన్ జోన్‌గా ప్రకటించామని, వాటికి అనుగుణంగా సెక్యూరిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. అను మతి లేకుండా ఎవరికి లోపలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో చాలా ప్రదేశాలను అతిథులు సందర్శి స్తారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల కోసం ఎలాంటి ట్రాఫిక్ డైవర్షన్‌లు ఉండవని అన్నారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారిని తీసుకెళ్తామని చెప్పారు. సిఎం , గవర్నర్, మంత్రులు, వీవీఐపీ, వీఐపీలకు ప్రోటోకాల్ ఉంటుం దని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కూడా ఫోర్స్‌ను తెప్పించా మని అన్నారు. 31వ తేదీన మిస్ వరల్డ్ ఫైనల్ ఉండనుందని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## జమ్మూ లక్ష్యంగా పాక్ దాడులు

### - అప్రమత్తం అయిన రక్షణ దళాలు

**న్యూఢిల్లీ,మే 8 :** భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజాగా జమ్మూ లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లతో దాడులకు యత్నిస్తున్నట్లు- జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. జమ్మూలోని ఓ ఎయిర్ స్ట్రిప్‌ను పాక్ లక్ష్యంగా చేసుకున్నట్లు- తెలుస్తోంది. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు భారీఎత్తున కాల్పులకు తెగబడుతున్నట్లు- సమాచారం. పలుచోట్ల భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. కిష్త్వార్, అఖ్నూర్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీచేసింది.

## నేడు జాగృతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

### - ఎమ్మెల్సీ కవిత నేతృత్వం

**హైదరాబాద్, మే 8:** భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా శుక్రవారం తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పీపుల్స్ ప్లాజా నుంచి 125 అడుగుల భారీ అంబేదర్ విగ్రహం వరకు సాగనున్న ఈ ర్యాలీకి తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వం వహించ నున్నారని పేర్కొన్నది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్ సిందూర్‌ను ప్రతిఒకరూ బలపరచాలని, వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి ప్రజలంతా వెన్ను దన్నుగా నిలవాలని జాగృతి సంస్థ విజ్ఞప్తి చేసింది. ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది.

## ఆపరేషన్ సిందూర్‌పై దుష్ప్రచారం చేస్తే చర్యలు : సీఎస్

**హైదరాబాద్, మే 8:** 'ఆపరేషన్ సిందూర్'పై ఎవరైనా దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఈ మేరకు తమ ఎక్స్ అధికారిక హ్యాండిల్‌లో పోస్టు పెట్టింది. 'సోషల్ మీడియాలో చాలామంది ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుడు వార్తల ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. దీంతో ఎంతోమంది భయభ్రాంతులకు గురవుతున్నారు. దుష్ప్రచారం నిరోధానికి మేము సోషల్ మీడియాను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించింది. ఇలాంటి పోస్టులు ఎవరికైనా కనిపిస్తే వెంటనే 8712672222 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సీఎస్‌బీ కోరింది.

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తే.. మీకు నూకలు చెల్లినట్లే

(మొదటి పేజీ తరువాయి)

భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు- పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం అని రేవంత్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ- సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ సంఘీభావ ర్యాలీ సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం పహల్గాం మృతులకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్‌లోని పలువురు మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి.. వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు- మౌనం పాటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యగా బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందులోభాగంగా పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మూకల స్థావరాలను నేలమట్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

## పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

(మొదటి పేజీ తరువాయి)

పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మోర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.

## మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపా యాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదా య నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు- చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ- వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు- చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు- చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు- చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు- చేస్తున్నామని దామోదర రాజ నర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్స్‌లు విద్యార్థులకు అందుబాటు-లో ఉంచబోతు న్నామని, పేద వారికి వైద్యం అందుబాటు-లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

## జిహాద్ పేరుతో హత్యలు చేస్తారా..?

(మొదటి పేజీ తరువాయి)



అన్ని పార్టీల సమావేశంలో ఓవైసీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా నిర్వహించిన భారత సాయుధ దళాలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలుపు తున్నానని అన్నారు. అలాగే టిఆర్ఎఫ్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రచారం ప్రారంభించాలని, అమెరికా కూడా దీన్ని విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరిలో హఫీజ్ అబ్దుర్ రౌఫ్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 'ఈ ఏడాది జిహాద్ చేయాలి' అని అన్నారని ఆయన గుర్తు చేసారు. 'జిహాద్' పేరిట భారతదేశంలో హత్యలు, భయోత్పాతం సృష్టించడమే వారి లక్ష్యమని, పాకిస్తాన్‌ను ఉగ్ర లిస్ట్ లో చేర్చాలని ఆయన కోరారు. అలాగేప్రభుత్వం కూడా ఉగ్రసంస్థను

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ- యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపా యాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభత రమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు- చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ- ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ- పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు-కు అన్ని రకాలుగా తోడ్పాటు- అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట-కి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

## ఉదయం ఎండ.. సాయంత్రం వాన

### ● మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి : వాతావరణశాఖ



**హైదరాబాద్, మే 8 :** రాష్ట్రంలో కొన్నిరోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు భానుడి భగభగలు ఉం టుం డగా, సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రానున్న మూడ్రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు తకువ నమోదయ్యే అవకాశమున్నదని పేర్కొన్నది. శుక్రవారం పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

## యూడీఎఫ్‌లను సవరించిన ముంబై ఎయిర్‌పోర్ట్



**ముంబై** విమానాశ్రయం నుంచి బయలుదేరే అంతర్జాతీయ విమానాలలో ఎకానమీ, బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు వేర్వేరు యూజర్ డెవలప్‌మెంట్ ఫీజుల ను ఎయిర్‌పోర్ట్స్ ఎకానమిక్ రెగ్యులేటరీ అథారిటీ సవరించింది. ముంబై నుంచి బయలుదేరే దేశీయ ప్రయాణికులకు చార్జీలను రూ.175 గా నిర్ణయించింది. సవరించిన టారిఫ్‌లను 2025 మే 16 నుంచి 2029 మార్చి 31 వరకు అమలు చేయనుంది.అంతర్జాతీయ ప్రయాణికులకు సంబంధించి.. ఎకానమీ, బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు వేర్వేరు లను ప్రవేశపెట్టింది. ఎకానమీ క్లాస్‌లో అంతర్జాతీయ ప్రయాణికుడికిలను రూ. 615 గా, బిజినెస్ క్లాస్‌లో అంతర్జాతీయ ప్రయాణికుడికి రూ.695గా నిర్ణయించింది. విమానయాన సంస్థల ల్యాండింగ్, పార్కింగ్ చార్జీలను కూడా క్రమబద్ధీకరించారు. పోటీగా ఉన్న ఇతర విమానాశ్రయాల చార్జీలను పరిగణనలోకి తీసుకుని ఈ రేట్లను నిర్ణయించారు.ప్రకారం.. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో మొత్తం ప్రయాణికుల విమాన ట్రాఫిక్‌లో 75 శాతం ఉన్న దేశీయ విమాన ప్రయాణికులకు నామమాత్రంగా రూ.175గా నిర్ణయించారు. విమానాశ్రయాన్ని అదానీ గ్రూప్ నేతృత్వంలోని ముంబై ఇంటర్నేషనల్‌ఎయిర్‌పోర్ట్‌లిమిటెడ్ నిర్వహిస్తున్నది.

## కాచిగూడలో బంగారం షాపులో చోరీ.. ముగ్గురు అరెస్ట్



**గోల్నాక, మే 8 :** అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బంగారం దుకాణంలో చోరీకి పాల్పడిన ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. డీఐ హాఫీజ్ ఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ మొఘల్‌పురాకు చెందిన సయ్యద్ ఆరిఫ్ ఉద్దీన్ (40), షేక్ అహ్మద్ ఉద్దీన్(45), నసీమా బేగం(40), కయాం సుల్తానా(70) కలిసి ఈ నెల 5న అంబర్‌పేట తిరుమలనగర్‌లోని భవన్ లాల్ బంగారం షాపునకు వెళ్లారు. అధిక బరువు గల బంగారు గాజులు చూపించాలని కోరారు. ఒక ట్రేలో బంగారు గాజులు చూపిస్తుండగా షాపు యజమాని దృష్టి మళ్లించి రూ. 2 లక్షల విలువగల బంగారు గాజులు దొంగతనం చేసి దానికి బదులుగా రోల్డ్ గోల్డ్ బంగారు గాజులను అక్కడ ఉంచి ఉడాయించారు. ఇది గమనించిన యజమాని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించారు. దొంగతనానికి పాల్పడ్డ నిందుతుల్లో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసి, చోరికి గురైన బంగారు గాజులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## ఇంటి పైకప్పు పెచ్చు కూలి ఆరుగురికి గాయాలు



**బీబీనగర్, మే 08 :** ఉన్నట్టుండి ఒక్కసారిగా ఇంటి పైకప్పు పెచ్చు ఊడి కిందపడడంతో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామ పంచాయతీలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ బొక్క వసుమతి జైపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పరె బొందమ్మ అనే మహిళ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తుంది. తన భర్త, కూతురు, ముగ్గురు మనుమరాళ్లతో కలిసి మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నిద్రించింది.ఆ సమయంలో ఇంటి పైకప్పు కూలి ఒక్కసారిగా వారిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం వీరిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఇళ్లు నాని ఉండడం వల్ల పైకప్పు కూలిందని తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి కోరారు

## ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైన్యానికి సెల్యూట్ : ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి



**పరిగి :** దేశ రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా మద్దతు పలుకుతామని పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతమొందిం చిన భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం పరిగిలోని కొడంగల్ క్రాస్‌రోడ్డులో నిర్వహిం చిన ప్రదర్శనలో ఎమ్మెల్యే మాట్లాడారు.భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడు లు చేసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసినందుకు సైన్యానికి సెల్యూట్ చెప్పారు. భారత దేశ పౌరులను, ఎల్లవేళలా దేశాన్ని కాపాడుతున్న సైన్యం సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. దేశ భద్రత విషయంలో పార్టీలకతీతంగా మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు లాల్‌క్రిష్ణ, పసాద్, పాలాది శ్రీనివాస్, చిన్న నర్సింలు, విజయకుమార్‌రెడ్డి, హన్మంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్ వెబ్ కంటెంట్‌పై కేంద్రం నిషేధం.. తక్షణం అమల్లోకి రావాలని ఆదేశాలు జారీ



**న్యూఢిల్లీ :** పాకిస్తాన్ వెబ్ కంటెంట్‌పై కేంద్రం ప్రభుత్వం నిషేధం విధించింది. దాయాది దేశం పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఓటీటీ వేదికల కంటెంట్‌ను నిలిపివేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీంతో భారత్‌లో పాక్ వెబ్ సిరీస్‌లు ఆగిపోనున్నాయి. సినిమాలు, పాటలు పాడ్ కాస్ట్ సహా మీడియా కంటెంట్ సేవలన్నీ రద్దు చేయాలన్నారు. వీటన్నింటిని అన్ని రకాల మీడియా కంటెంట్ ప్లాట్ ఫాం నుంచి తొలగించాలని భారత్‌కు చెందిన ఓటీటీ సంస్థలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.జాతీయ భద్రత దృష్ట్యా పాకిస్తాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, ఓటీటీ వేదికలు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు, మధ్యవర్తిత్వం ద్వారా అయ్యే ఏ ప్రసారమైనా ఇక పూర్తిగా నిలిపివేస్తున్నాం. పాకిస్తాన్ వెబ్ సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్ కాస్ట్‌లు సహా మీడియా కంటెంట్ ఏదీ ఇక భారత్‌లో అందుబాటులో ఉండదు. సబ్‌స్క్రిప్షన్, సహా ఇతర మార్గాల ద్వారా కంటెంట్ పొందుతున్న వారికీ ఇందులో ఏ మినహాయింపు లేదు. ఓటీటీ వేదికలు పాకిస్తాన్ కంటెంట్‌ను భారత్‌లో స్ట్రీమింగ్ చేయడానికి వీల్లేదు అని సమాచార,ప్రసారమంత్రిత్వ శాఖ ఆదేశించింది.

# భారత్ దెబ్బ.. జైషే చీఫ్ సోదరుడు, ఐసీ-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి

**పహల్గాం** ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది దేశం పాక్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేపట్టిన ఈ దాడులతో జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్ కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికే అజార్ కుటుంబం మొత్తం హతమైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన సోదరుడు, ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సైతం ప్రాణాలు కోల్పోయారు.భారత్ దాడుల్లో బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో 10 మంది మసూద్ కుటుంబ సభ్యులు, నలుగురు సహాయకులు ప్రాణాలు కోల్పోయారు. జైషే చీఫ్ ప్రాణాలతోనే ఉన్నట్లు తెలిసింది. భారత్ జరిపిన దాడిలో



తన కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయినట్లు మసూదే స్వయంగా వెల్లడించారు. తాజాగా అతడి సోదరుడు రవూఫ్ అస్గర్ కూడా మరణించారు.రవూఫ్ అస్గర్ పలు ఉగ్రదాడుల్లో కీలక నిందితుడు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్ 814 సూత్రధారి. అతడి మాస్టర్‌మైండ్స్‌తో ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు తరలించారు. అనంతరం భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. ఇక్కడి జైళ్లలో ఉన్న ఉగ్రనాయకులు మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్‌ను విడిపించుకొని తీసుకెళ్లారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో కూడా ఇతడి పాత్ర ఉంది. అంతేకాదు భారత్‌లో జరిగిన పలు ఉగ్రదాడుల వెనుక ఇతడి హస్తం ఉంది. 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది.

# పాక్‌కు గట్టి షాక్.. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసిన భారత్

**పహల్గాం** పొరుగుదేశం పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి షాకిచ్చింది. పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై భారత సైన్యం విరుచుకుపడింది. ప్రతీకార దాడులకు ప్రయత్నించిన దాయాది దేశానికి కోలుకోలేని దెబ్బ కొట్టింది.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' (%ాజూవతీఎఱశీఅ ాఱఅఅశీశీ%)ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలపై పాకిస్థాన్ దాడులు చేసేందుకు ప్రత్నించింది. బుధవారం రాత్రి, ఇవాళ తెల్లవారుజామున భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాక్ ప్రయత్నించినట్లు రక్షణ శాఖ తెలిపింది. అయితే, ఆ దాడులను భారత బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి.జమ్ము కశ్మీర్, పంజాబ్, గుజరాత్, శ్రీనగర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, లూథియానా, చండీగఢ్ సహా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని



భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ దాడులకు ప్రయత్నించినట్లు తెలిపింది. వీటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు పేర్కొంది. పాక్ మిస్సైళ్లను గగనతంలోనే పేల్చేసినట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు తెలిపింది. పాకిస్థాన్ వైమానిక రక్షణ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని ధ్వంసం చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. హార్పీ డ్రోన్స్ ను ఉపయోగించి పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను నిర్వీర్యం చేసినట్లు ప్రకటించింది. మరోసారి కవ్వింపులకు పాల్పడితే ప్రతిదాడులు తప్పవని తీవ్రంగా హెచ్చరించింది.మరోవైపు ఎల్‌వోసీ వద్ద పాక్ కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూనే ఉంది. కుప్వారా, బారాముల్లా, యురి, పూంఛ్, మెందార్, రాజౌరి సెక్టార్లలో పాక్ కాల్పులకు పాల్పడుతోంది. మోర్టార్లు, భారీ శతఘ్నులతో దాడులకు తెగబడుతోంది. పాకిస్తాన్ దాడుల నేపథ్యంలో భారత్ ప్రతిదాడులుచేయకతప్పనిపరిస్థితి ఏర్పడింది.

## ఆపరేషన్ సిందూర్‌తో నేలమట్టమైన ఉగ్రస్థావరాలు.. ఉపగ్రహ చిత్రాలు

**జమ్ము కశ్మీర్‌లోని** పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' (%ాజూవతీఎఱశీఅ ాఱఅఅశీశీ%) పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. వాటిలోని అనేక మంది ముష్కరులను తుదముట్టించింది. వీటికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలు తాజాగా బయటికొచ్చాయి.భారత్ దాడుల్లో బహవల్‌పూర్‌లోని



జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం మురీద్కేలోని లష్కరే తయ్యిబా ఉగ్ర క్యాంప్‌లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు నలుగురు సహాయకులు, సన్నిహితులు కూడా మరణించినట్లు తెలిసింది. మొత్తంగా భారత్ జరిపిన ఈ దాడిలో 80 మంది వరకూ ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిచర్యగా పాకిస్థాన్ దాడులు చేసే అవకాశం ఉండటంతో భారత్ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా పంజాబ్‌లో హై అలర్ట్ ప్రకటించింది. అన్ని ప్రజా కార్యక్రమాలను రద్దు చేశారు. విమానాశ్రయాలను మూసివేసింది.

# చేతకాని తనంతో రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్న ప్రభుత్వం : ఎర్రబెల్లి దయాకర్‌రావు

**వర్ధన్నపేట, మే 8 :** రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలించడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా తీయిస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఐనవోలు, వర్ధన్నపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనేవిధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పడం వల్ల అనేక పరిశ్రమలు, పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారని అన్నారు.దీనివల్ల రానున్న రోజుల్లో నిజంగానే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడిన కూడా పదేళ్లపాటుగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా సమర్ధవంతగా పనిచేయడం జరిగిందన్నారు. అనేక పరిశ్రమలు తెలంగాణకు వచ్చి పారిశ్రామిక ప్రగతి సాధించిందన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత క్రమంగా రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో పడిపోతున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహా మంత్రులు కేవలం దోచుకోవడం, దాచుకోవడంతోనే




సరిపుచ్చుకుంటున్నారని అన్నారు.రాష్ట్రంలో తిరిగి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. అలాగే ఉగ్రవాదంపై భారత సైన్యం చేస్తున్న యుద్ధానికి మద్దతుగా బీఆర్‌ఎస్ చేపట్టిన ర్యాలీలో మాజీ మంత్రి దయాకర్‌రావు జాతీయ జెండా పట్టుకొని పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా తుదముట్టించేందుకు భారతసైన్యానికి దేశ ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తూ రాజకీయాలను పక్కన బెట్టాలని కోరారు.

# పర్పుల్ రంగు బెండకాయలను తింటున్నారా..

బెండకాయలు మనం తరచూ తినే కూరగాయల్లో ఒకటి. వీటితో కూర, పులుసు, వేపుడు చేస్తుంటారు. చారులోనూ బెండకాయలను వేసి తింటారు. బెండకాయలు ఎంతో రుచిగా ఉంటాయి. వీటితో అనేక రకాల వంటకాలను చేయవచ్చు. అయితే బెండకాయల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో పర్పుల్ కలర్ బెండకాయలు కూడా ఒకటి. ఆకుపచ్చని బెండకాయల తరువాత మనకు ఇవే అధికంగా లభిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్లే ఈ కాయలు ఆ రంగులో ఉంటాయి. ఆంథో సయనిన్స్ అనేవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.ఆర్థరైటిస్ నొప్పులకు..చెబుతున్న ప్రకారం ఈ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే క్యాన్సర్ కణాలు పెరగనీయకుండా అడ్డుకోవచ్చు. పర్పుల్ బెండకాయల్లో మ్యుసిలేజ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జిగురు లాంటి పదార్థం. ఇది మన శరీరంలో చేరితే కొలెస్ట్రాల్‌కు అతుక్కుంటుంది. దీంతో కొలెస్ట్రాల్ తొలగించబడుతుంది. జీర్ణ వ్యవస్థ ఈ కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ బెండకాయలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం పర్పుల్ రంగు బెండకాయలను తినడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే పలు రకాల సమ్మేళనాలు ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా గ్రహిస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గిపోతాయి. ఈ కాయల్లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అలాగే షుగర్ లెవల్స్ తగ్గేందుకు కూడా సహాయం చేస్తుంది.

మెదక్ టుడే

# కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరువ చేయాలి.

### ఆర్గానిక్. ఫామింగ్, వ్యవసాయ పనిముట్లపై రైతులు మొగ్గు చూపాలిజిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచన

**మెదక్ మే 8 మెదక్ టుడే న్యూస్** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరువ చేయాలని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అధ్యక్షతన కలెక్టరేట్ లో నిర్వహించడం జరిగింది ఈ దిశ సమావేశానికి పార్లమెంటు సభ్యులు మాధవ నేని రఘునందన్ రావు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ భుజంగరావు, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, ఎఫ్సి ఎం డైరెక్టర్ సురేష్ బాబు తో కలిసి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.విద్యా, వైద్యం, వ్యవసాయం పరిశ్రమలు, పౌరసరఫరాల, ప్లానింగ్, సంక్షేమ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,గ్రామీణ అభివృద్ధి, శాఖల అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా ఎం.పీ సమీక్షించారు.ముందుగా గత దిశ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై అధికారులను ప్రశ్నలు సమాధానాలు రూపంలో అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాధవ నేని రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు అందజేయడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ప్రతి పథకానికి సంబంధించి విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో అవగాహన పెంపొందించి పథకాలు అందేలా చూడాలన్నారు.విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ బాలికల పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టి , ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు,ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశు భ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రత్యేక క్లినిక్ చేయడానికి క్లీనింగ్ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా మన జిల్లాకు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టి పూర్తిచేసిన పనులకు గాను కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు కాలేదని ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎంపీ దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో సంప్రదించి సమస్య పరిష్కార దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ నిధుల నుండి మండలాల్లో ప్రతి మండలానికి 02 అంగన్వాడి సెంటర్స్ మంజూరు చేయడం జరిగిందని వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సబ్ సెంటర్స్ 20 లక్షల వ్యయంతో నిర్మించి తలపెట్టిన టెండర్ దశలో ఉన్న వాటికి 20 లక్షల వ్యయం సరిపోవటం లేదని అదనపు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. మెదక్ మెడికల్ కాలేజీ కి ఫ్యాకల్టీ.. ఇన్ఫ్రాస్ట్రక్చర్, లప్రో స్కోపీ




కావాలని ఈ సమావేశంలో మెడికల్ సూపర్డెంట్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.నర్సాపూర్ గుమ్మడిదల 4 లైన్ల రోడ్ 2025.26 లో శాంక్షన్ అవుతుందని తెలిపారు.వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు జిల్లాలో పత్తి కొనుగోలు, సన్ఫవర్ కొనుగోలు మార్కెటింగ్, సంబంధిత విషయాలు, వడ్ల కొనుగోలు నిర్వహణ రైతుల ఎకౌంట్లో 48 గంటల్లో డబ్బులు జమ విషయాలు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల ద్వారా ఆరా తీశారు జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా ఆర్గానిక్ ఫామింగ్, వ్యవసాయ పనిముట్లు పై రైతులు మొగ్గు చూపేలా అవగాహన సదస్సుల ద్వారా విస్తృత ప్రచార కల్పించాలని ఎంపీ ఆదేశించారు.మార్కెటింగ్ కమిటీలు, నాబార్డ్ గోదాము వివరాలపై సుదీర్ఘ వివరణ ఇవ్వాలని అన్నారు.జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డుల వివరాలు రేషన్ కార్డు లబ్ధిదారులకు పారదర్శకంగా సన్న బియ్యం సరఫరా, రైస్ మిల్లులో తనిఖీ వివరాలు పిడిఎస్ బియ్యం అమ్ముకున్న విషయంలో కేసు నమోదు మిల్లులను సీజ్ చేయడం సంబంధిత విషయాలను సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానమంత్రి సిరీస్ పథకం అమలు మంజూరైన నిధులు ,లైబ్రరీ, పిల్లలకు విజ్ఞాన విహారయాత్రలు వెచ్చించిన అంశాలను వాటిపై చర్చించారు.జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా పీఎం విశ్వకర్మ పథకం సమర్థవంతంగా అమలుతీరును అడిగి తెలుసుకున్నారు నేషనల్ హైవే ద్వారా చేపట్టిన మెదక్ సిద్దిపేట రోడ్డు, స్టేజ్ వన్ ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంలో నేషనల్ హైవే, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు గుమ్మడిదలహ నర్సాపూర్ మెదక్ నేషనల్ హైవే 765 డి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు జిల్లా సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను జిల్లాలో అంగన్వాడి సెంటర్స్ ద్వారా చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని బాల్య వివాహాలను నిర్మూలించడానికి జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు సుకన్య సమృద్ధి యోజన పథకం 40 నందిని ఎన్రోల్మెంట్ చేయడం జరిగిందని, ఐసిడిఎస్ టీచర్ల ద్వారా పదవ తరగతిలో పాసైన విద్యార్థినీ విద్యార్థులను ఇంటర్మీడియట్లో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు సంక్షేమ శాఖ అధికారి హైమావతి ఎంపీ గారికి వివరించగా అంగన్వాడీలను సమర్థవంతంగా



నిర్వహిస్తూ బలోపేతం చేసే దిశగా ముందుకు పోవాలన్నారు.జిల్లా పంచాయతీ అధికారి ద్వారా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో మోడల్ సోలార్ గ్రామాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలనిజిల్లా స్థాయి కమిటీ చర్చించి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 5,000 మంది పాపులేషన్ ఉన్న గ్రామపంచాయతీని గుర్తించి, ఆ గ్రామంలో ప్రతి ఇంటికి సోలార్ పవర్ ఏర్పాటు చేయడంతో పాటు, వీధిలైట్లు కూడా సోలార్ తో వెలిగే విధంగా చూడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య వివరించగాప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలి యోజన అనేది భారతదేశంలోని గృహాలకు ఉచిత విద్యుత్తును అందించడం లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ పథకం . ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 15, 2024న ప్రారంభించారు. ఈ పథకం కింద, గృహాలకు వారి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీని అందిస్తారని సమర్థ నిర్వహణకు తగ సూచనలు చేశారు.విద్యుత్ శాఖ ద్వారా ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్మెంట్ పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు .ఇరిగేషన్ శాఖ ద్వారా ట్రిబుల్ ఆర్ పథకం అమలు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా , భూగర్భ జల శాఖ ద్వారా ప్రస్తుతం ఉన్న భూగర్భ జలాల పరిస్థితి, గ్రౌండ్ వాటర్ తగ్గకుండా తీసుకోవాల్సిన చర్యలు, అన్ని ఇండ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు జిల్లాలో మున్సిపాలిటీల పనితీరు శానిటేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తదితర విషయాలపై సమావేశాల ద్వారా చర్చించుకుని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ దిశ సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులతో సమావేశాలు నిర్వహించుకుని కేంద్ర అభివృద్ధి పథకాల కార్యక్రమాల పురోగతిపై చర్యలు తీసుకుంటామన్నారు.10 వ తరగతి లో మంచి రిజల్ట్ వచ్చిందని,బాల్యవివాహాలను, డ్రాప్ అవుట్లను అరికట్టేందుకు పదవ తరగతి పాస్ అయిన పిల్లలను ఇంటర్మీడియట్లో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు.

### కేక్ కట్ చేసి మజ్జిగ పాకెట్ల పంపిణీ. హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్, మే 08 :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మంచిర్యాల చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు




బానోతు శ్రవణ్ నాయక్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్న రాజ మల్లయ్య ఎస్సీ సెల్ కన్వీనర్లు జీడి రమేష్, జుంజుపల్లి వివేక్ కాంగ్రెస్ నాయకులు కాడె శంకర్, దండి రవీందర్, మేడి అంజయ్య, అస్తపురం రమేష్, గాలి అనిల్, పెద్దిగారి తిరుపతి, కొట్టే ప్రభాకర్, షబానా హనీఫ్, కీర్తి కుమార్ పాల్గొన్నారు.

# సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

### ఈనెల 17 లోగా మీ సేవలో దరఖాస్తు సమర్పించాలి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మే 08** భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన భూ భారతి రెవిన్యూ చట్టం, 2025 (భూమి హక్కుల రికార్డు)ను తీసుకొచ్చిందని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5000 మంది లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఈ లైసెన్స్డ్ సర్వేయర్లను జిల్లాల్లో నియమిస్తారని తెలిపారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్ ఇప్పటికే నోటిఫికేషన్ ప్రచురించిందని తెలిపారు. 05.05.2025 నుండి 17.05.2025 వరకు



రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించనుందని పేర్కొన్నారు. 26.05.2025 నుండి 26.07.2025 వరకు (50 పని దినాలు) శిక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి సహాయంతో ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సర్వేయర్ల శిక్షణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలును వేగవంతం చేయండి

### ఆర్డిఓ జయచంద్రరెడ్డి

**చేగుంట, మెదక్ 8,మెదక్ టుడే న్యూస్ :** చేగుంట తాసిల్దార్ కార్యాలయం నందు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి ధాన్యం కొనుగోలు నెమ్మదిగా జరుగుతున్న నేపథ్యంలో ఏపీఎం, సిసి , పిఎసిఎస్ ల సీఈఓస్ , ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలని, ఎప్పటికీకప్పుడు కొనుగోలు వివరాలు ట్యాబు లో నమోదు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. ఈ నెల 15 తేదీ కల్లా



ప్రతి గ్రామంలో పి పి సి లో సిద్ధంగా ఉన్న ధాన్యంను పూర్తిగా కొనుగోలు చేసి, పి పి సి లు త్వరగా క్లోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినట్లయితే ,రైతులు దిగులు చెందవలసిన అవసరం లేదని, అట్టి ధాన్యం ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. లారీల కొరత కొంత ఉంది కావున రైతులు తమ ట్రాక్టర్ ద్వారా ధాన్యం రవాణాను ముందుకు వస్తే అద్దె డబ్బులు చెల్లిస్థామని తెలిపారు. పిఎసిఎస్ సీఈవో ల పనివిధానం పట్ల అసంతృప్తి వ్యక్త పరిచారు, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు చిత్త శుద్ధి తో పనిచేసినట్లయితే సత్ఫలితాలు వొస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఏపీఎం లక్ష్మీ నరసమ్మ, మండల గిర్ధవరులు, పి పి సి ల ఇంచార్జీలు, పిఎసిఎస్ ల సీఈవో లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# ఆర్మీ బ్రిగేడ్‌పై ఆత్మాహుతి దాడి జరగలేదు.. పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టిన భారత్





**జమ్మూకశ్మీర్** రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఆత్మాహుతి దాడి జరిగిందని జరుగుతున్న ప్రచారాన్ని భారత్ కొట్టిపారేసింది. దేశంలోని ఏ ఆర్మీ కంటోన్మెంట్‌లోనూ ఆత్మాహుతి దాడులు జరగలేవని పీఐబీ స్పష్టం చేసింది. తప్పుదోవ పట్టించే, గందరగోళానికి దారితీసే ఇటువంటి నకిలీ వార్తల ఉచ్చులో పడవద్దని హెచ్చరించింది.అలాగే పాకిస్థాన్లోని నీలమ్ జెలుం హైడ్రో పవర్ ప్రాజెక్టుపై భారత్ దాడికి తెగబడిందన్న వార్తలను కూడా పీఐబీ ఖండించింది. ఆ వార్తలన్నీ నిరాధారమని స్పష్టం చేసింది. ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే భారత్ దాడులకు పాల్పడిందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపారని వెల్లడించింది.ఇదిలా ఉంటే ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్‌పై పాకిస్థాన్ దాడులకు తెగబడింది. గురువారం రాత్రి సత్వారీ, సాంబా, ఆర్ఎస్ పురా, ఆర్నియా సెక్టార్లలో పాక్ క్షిపణి దాడులకు ప్రయోగించింది. అయితే పాక్ దాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. పాకిస్థాన్ ప్రయోగించిన ఎనిమిది మిస్సైల్స్‌ను విరోచితంగా కూల్చివేసింది. అలాగే రాజస్థాన్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని కూడా కూల్చివేసినట్లు తెలుస్తోంది. వీటితో పాటు రెండు జేఎఫ్17 యుద్ధ విమానాలను సైతం కూల్చివేసిందని సమాచారం. అయితే ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని భారత రక్షణ శాఖ స్పష్టం చేసింది. దేశ ప్రజల రక్షణ, సమగ్రతను కాపాడేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు వెల్లడించింది.

# భారత దేశ ప్రతిష్టకు భంగం కలుగచేసే వారని ఉపేక్షించలేదు.

### ఎంపీ ఆగ్రహం


**మెదక్ మే 8 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** మన దేశ ప్రతిష్టను వారని ఎవ్వరిని కూడా ఉపేక్షించలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం రోజున నమస్తే తెలంగాణ ఈ పేపర్ లో వచ్చిన వార్త మన దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా వున్నాయని మండిపడ్డారు. భారత్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కూల్చివేసిందని తప్పుడు వార్తలు రాసిన పత్రిక ఎడిటర్ యాజమాన్యం మీద కేసు నమోదు చేయాలని



డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా ఎస్పీ ఈ విషయం పై ఎంపీ బీజేపీ జిల్లా నాయకుల చేత ఎంపీ లెటర్ ప్యాడ్ పై రాసిన పిర్యాదును బిజెపి మెదక్ జిల్లా నాయకులు గడ్డం శ్రీనివాస్ , కాశీనాథ్ , రమేష్ గౌడ్ , నాయిని ప్రసాద్ , సతీష్ , శివ జిల్లా ఎస్పీకి కేసు నమోదు చేయాలని కోరారు.

# జాతీయ రహదారి పక్కన మహిళ మృతదేహం

**చేగుంట,ఏప్రిల్ 8, మెదక్ టుడే న్యూస్ :** చేగుంట చిన్నశివనూర్ గ్రామ శివారులో ఎన్ హెచ్ 44 రోడ్డు పక్కన మక్కరాజ్ పెట్ బ్రిడ్జి దగ్గరలో గల హైవే టాయిలెట్స్ కు 200 మీటర్ల దూరంలో రోడ్డు పక్కన గల ఖాళీ స్థలంలో 35 నుండి40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని ఒక మహిళ శవం కాలిపోయి గుర్తించడం జరిగింది.కాళ్లకు వెండి కడియాలు ఉన్నవి... ఎవరైనా గుర్తు పట్టినట్లయితే ఈ నెంబర్ ఫోన్ చేయగలరు సీఐ,రామాయంపేట 8712657933, ఎస్ఐ,చేగుంట




# చొరబాటుకు యత్నం..పాక్ జాతీయుడిని కాల్చివేసిన బీఎస్ఎఫ్

**ఢిల్లీ:** భారత్‌లోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్ కు చెందిన వ్యక్తిని సరిహద్దు భద్రతా దళానికి చెందిన జవాన్లు కాల్చి వేశారు. బుధవారం అర్ధరాత్రి పంజాబ్ లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో ఈ ఘటన జరిగింది. చీకటిలో ఉద్దేశపూర్వకంగానే ఆ వ్యక్తి దూసుకు రావడాన్ని గమనించి ఈ కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. తర్వాత మృతదేహాన్ని పోలీసులకు అప్పగించారు. అతని దగ్గర నుంచి పాకిస్థాన్‌లో తయారైన వ్యవసాయ రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి అందరూ నిద్రపోతున్నవేళ.. క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ విరుచుకు పడింది. సరిహద్దుకు ఆవల 100 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చింది. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకుంది. ఈ తరుణంలో సరిహద్దులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచు కొంటున్న రాష్ట్రాల్లో భద్రతా చర్యలు పెంచారు.రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును సీల్ చేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరి స్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. పంజాబ్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకొంది. సరిహద్దు ల్లోని ఆరు జిల్లాల్లో పాఠశాలలను మూసివేసింది. జమ్మూకశ్మీర్లో నేడు కూడా పాకిస్థాన్ దళాలు శతఘ్ని గుండ్లను కాలుస్తున్నాయి. దీంతో మన సైన్యం దీటుగా బదులిస్తోంది. పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్

**చేగుంట,మే 8,మెదక్ టుడే న్యూస్:** చేగుంట మండలం కాన్యారం గ్రామంలో ఇటీవల వడ్డే హరి మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబానికి పరమాశించి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ 50కిలోల బియ్యం ఆర్థిక సహాయం అందజేశాడు .ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు తయ్యాబ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, కన్యరా%శీ% కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు విఠల్, సొమ్ల



తండ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు, రాంపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు చాకలి అశోక్, సీనియర్ నాయకులు కాశబోయిన శ్రీనివాస్, బాధ్య నాయక్ , జెల్సింగ్ నాయక్,నవీన్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రతను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నాం.. పాక్ దాడులపై భారత రక్షణ శాఖ ప్రకటన

**పాకిస్థాన్** దాడులపై భారత రక్షణ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. జమ్మూ, పఠాన్‌కోట్, ఉధమ్‌పూర్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడిందని వెల్లడించింది. డ్రోన్లు, మిస్సైల్‌తో ఈ దాడులకు తెగబడిందని చెప్పింది. మార్గదర్శకాల ప్రకారం ధీటుగా తిప్పికొడుతున్నామని స్పష్టం చేసింది.ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని స్పష్టం చేసింది. దేశ ప్రజల రక్షణ, సమగ్రతను కాపాడేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు వెల్లడించింది. కాగా, గురువారం రాత్రి సత్వారీ, సాంబా, ఆర్ఎస్ పురా, ఆర్నియా సెక్టార్లలో పాక్ క్షిపణి దాడులకు ప్రయోగించింది. అయితే పాక్ దాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. పాకిస్థాన్ ప్రయోగించిన ఎనిమిది మిస్సైల్స్‌ను విరోచితంగా కూల్చివేసింది. అలాగే రాజస్థాన్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని కూడా కూల్చివేసినట్లు తెలుస్తోంది. వీటితో పాటు రెండు జేఎఫ్17 యుద్ధ విమానాలను సైతం కూల్చివేసిందని సమాచారం.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..